క్లుప్తంగా

చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ డీ.వెంకటేశ్వరరావు

బేతంచెర్ల: వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రారంభంకానున్న వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సీఐ డీ. వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, గణేష్ కేంద్ర ఉత్సవ సమితి అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ రమేష్ బాబు, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు విగ్రహాలు నెలకొల్పే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు మొదలుకొని, నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 10వ తేదీన నిమజ్జనం రోజున తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, విద్యుత్ టౌన్ ఏఈ మహబూబ్‌వలీ, కమిటీ సభ్యులు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, డక్కి శేఖర్, రమణ పాల్గొన్నారు.

రైతులు సుభిక్షంగా ఉండాలని..

డోన్: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ మండలంలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం వేప,రావి చెట్లకు వివాహం జరిపిస్తామని గ్రామస్తులు గురువారం తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు మహోత్సవం జరుగుతున్నందున మండలంలోని ప్రజలందరూ పాల్గొనాలని గ్రామస్తులు కోరారు.

అన్నదానం

డోన్: స్థానిక వందపడకల ప్రభుత్వాసుపత్రిలో గురువారం రోగులు, గర్భిణులు, బాలింతలు, సహాయకులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర హనీఫ్ మాట్లాడుతూ, ప్రార్థన సమయం, స్ఫూర్తి, ద్రోణాచలం సేవాసమితి ఆధ్వర్యంలో నిరంతరం రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఆలంకొండ జిలేబీ బాషా, షేక్ నూర్జహాన్, రిటైర్డు ఎస్ఐ నజీర్, ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బేతంచెర్ల: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అబ్రహాం అన్నారు. గురువారం పట్టణంలోని ధరణి టౌన్ షిప్‌లోని మెయిన్ జెడ్పీ హైస్కూల్లో హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

ఫిట్‌నెస్ రెన్యూవల్ చేసుకోవాలి

డోన్ రూరల్ : వాహనదారులు తమ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యూవల్ చేయించుకోవాలని ఆర్‌టీఓ క్రాంతికుమార్ తెలిపారు. పట్టణం సంమీపంలోని ఆర్‌టీఓ కార్యాలయంలో వాహన యజమానులు, వివిధ రకాల వాహనాల అసోసియేషన్ వారితో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1తేదీ నుంచి ఫిట్‌నెస్, ఎఫ్‌సీ రెన్యూవల్ కోసం నంద్యాల జిల్లాలోని ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌కు వెళ్లాలని సూచించారు.

ఘనంగా త్యాగరాజస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: స్థానిక నాయీబ్రాహ్మణ కాలనీలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన త్యాగరాజ స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్టను పురస్కరించుకొని గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత కళాకారుల వాయిద్యాల మధ్య తాడిపత్రి రోడ్డులోని ఆలయం నుంచి గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రెండో రోజు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ధ్వజ స్తంభం, త్యాగరాజస్వామి, సీతా, లక్ష్మణ, కోదండరామ స్వామి విగ్రహాలను ప్రతిష్ట చేయనున్నారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు

డోన్: మండలంలోని మల్లెంపల్లె గ్రామ గొర్రెల పెంపకందారుల సహకార సంఘానికి గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల పరిశీలకుడిగా బేతంచెర్ల మండలం ముద్దవరం వెటర్నరీ అసిస్టెంట్ రంగస్వామి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించినట్లు పర్యవేక్షకులు ఏడీఏ డాక్టర్ నాగరాజు తెలిపారు. అధ్యక్షుడిగా ఉన్నిగొర్ల పెద్దసుంకన్న, కార్యదర్శిగా సుంకన్నతో పాటు సభ్యులుగా రంగస్వామి, చిన్న సుంకన్న, గొల్ల చిన్నరాజు, ఉన్నిగొర్ల కొలయ్య, సలీంద్ర సీతన్నను ఎన్నుకున్నట్లు వివరించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఖలీల్, గ్రామ పెద్దలు శ్రీనువాసులు, ఎస్పీ సుంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

- పూర్వ ప్రాథమిక విద్యపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం
- అంగన్‌వాడీ కేంద్రాలకు అందని పాఠ్యపుస్తకాలు
- రెండు నెలలు దాటినా సరఫరా కాని వైనం
- పాత పుస్తకాలతోనే విద్యాబోధన

అఆలు రాసేదెట్లా.. ఏబీసీడీలు నేర్చుకునేదెట్లా !



కోవెలకుంట్లలోని అంగన్‌వాడీ కేంద్రం



పాత పుస్తకాలతోనే చిన్నారులకు బోధన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

కోవెలకుంట్ల: చదువులకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు. సౌకర్యాల మధ్యన ఆహ్లాదకర వాతావరణంలో ఆట బొమ్మలతో, ఆకట్టుకునే పుస్తకాలతో చిన్నారులకు విద్యనందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న చిన్నారులపై చిన్న చూపు చూస్తోంది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ నెలలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోగా రెండు నెలలు దాటినా అంగన్‌వాడీ కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఎనిమిది ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా 1,620 అంగన్‌వాడీ కేంద్రాలు, 43 మినీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో సున్నా నుంచి 6 నెలల లోపు 16,548 మంది చిన్నారులు, ఏడు నెలల నుంచి ఏడాదిలోపు 14,698 మంది, సంవత్సరం నుంచి మూడేళ్లలోపు 50,137 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు 39,462 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు సరఫరా చేయకపోవడంతో ఆయా కేంద్రాల్లో పాత పుస్తకాలతో బోధన కొనసాగుతోంది. అంగన్‌వాడీలకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు అందకపోవడంతో కార్యకర్తలు పాత పుస్తకాలతో బోధన సరిపెడుతున్నారు. గత ప్రభుత్వం సకాలంలో పాఠ్యపుస్తకాలను సరఫరా చేయడంతో పాటు వాటిలో చిన్నారులకు ఎంతో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండటంతో తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల శ్రద్ధ తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేవారు. ప్రస్తుత ప్రభుత్వం కేంద్రాలకు పాఠ్యపుస్తకాలను అందించకపోవడంతో విద్యాబోధన మొక్కుబడిగా మారింది. కొత్త పుస్తకాలు ఇస్తారో లేదో అన్న సందేహంతో తల్లిదండ్రులు వారి తతమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గుచూపుతున్నారు.

నాడు పీపీ – 1, పీపీ – 2 కిట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అన్ని రకాల పుస్తకాలను సరఫరా చేసింది. నాలుగు పుస్తకాలతో కూడిన బర్డ్స్-1, బర్డ్స్-2 కిట్లను అందించింది. వీటితో పాటు అంగన్‌వాడీల్లో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా ఇంగ్లీష్‌లో పాఠాలు బోధిస్తుంటే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గననీయంగా పెరుగుతూ వచ్చింది. బోధనకు సంబంధించి రెండు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ డ్రాయింగ్స్‌కు సంబంధించి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లను అందజేసేవారు. నాలుగేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ ఊసే లేకుండా పోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతంత మాత్రంగానే కూరగాయల బిల్లులు:

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకవైపు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు సరఫరా చేయకపోవడమే కాక మరో వైపు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కూరగాయల బిల్లులు అంతంత మాత్రంగానే చెల్లిస్తోంది. ఆయా కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు పాలు, ప్రతి రోజు గుడ్డుతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఒక్కో చిన్నారికి గ్యాస్ బిల్లుతో సహా కూరగాయలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ. 2.75 ప్రకారం చెల్లిస్తోంది. మార్కెట్‌లో కూరగాయల బిల్లులు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రభుత్వం చెల్లించే మొత్తం ఏ మాత్రం సరిపోవడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, గ్యాస్ రూపంలో ప్రభుత్వం చెల్లించే మొత్తానికి అదనపు భారం పడుతోందని వాపోతున్నారు. కూరగాయల బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మధ్యాహ్న భోజన పథక నిర్వహణ భారంగా మారింది. ప్రస్తుతం కూరగాయలు, గ్యాస్‌రూపంలో ఇచ్చే మొత్తాన్ని రెట్టింపు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

పాత పుస్తకాలతోనే బోధిస్తున్నాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాదికి సంబంధించిన కొత్త పాఠ్యపుస్తకాలు ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే ఆయా కేంద్రాలకు అందజేస్తాం. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 262 అంగన్‌వాడీ కేంద్రాలు, 12 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ప్రస్తుతం మా వద్ద ఉన్న పాత పాఠ్య పుస్తకాలతోనే బోధిస్తున్నాం. ప్రతి రోజు టైం టేబుల్ ప్రకారం అన్ని కేంద్రాల్లో చిన్నారులకు విద్యాబోధన కొనసాగుతోంది.

– ఉమామహేశ్వరమ్మ, సీడీపీఓ, బనగానపల్లె

పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాలి



జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు యుద్ధప్రాతిపదికన పాఠ్యపుస్తకాలు సరఫరా చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు అందకపోవడంతో పాత పుస్తకాలతో విద్యాబోధన కొనసాగుతోంది. పాఠ్యపుస్తకాలతోపాటు కూరగాయలు, గ్యాస్‌కు చెల్లించే మొత్తాన్ని రెట్టింపు చేసి సకాలంలో బిల్లులు అందజేయాలి.

– మాబు ఉసేన్, విద్యార్థి సంఘం నాయకుడు, కోవెలకుంట్ల

హ్యాండ్ ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని కేజీఆర్ కాంప్లెక్స్‌లో లావణ్య మహిళా మండలి ఆధ్వర్యంలో హ్యాండ్ ఎంబ్రాయిడరీపై ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు మహిళా మండలి అధ్యక్షురాలు రోజారమణి గురువారం తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు సెల్ 77022 24649 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

టీకాలు సకాలంలో వేయండి

సంజామల: పశువులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయాలని పశు సంవర్ధక శాఖ ఆళ్లగడ్డ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణయ్య సూచించారు. మండల కేంద్రం సంజామల ప్రాంతీయ పశువైద్యశాలలో సంజామల, కొలిమిగుండ్ల మండలాల పశువైద్యులు, పశువైద్య సిబ్బందితో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మోహన్ రావుతో కలిసి సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ మాట్లడుతూ.. గాలికుంటు వ్యాధి, బ్లూటంగ్ టీకాలు త్వరితగతిన వేయాలని సూచించారు. పాడిరైతులు పశు బీమా చేయించుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు పద్మావతి, రఘుబాల కృష్ణా, రమేష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

డోన్ రూరల్ : పట్టణంలోని సెబ్ కార్యాలయంలో ఈనెల 31వ తేదీన వివిధ కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామని సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు సెబ్ కార్యాలయంను సంప్రదించాలని సూచించారు.

క్రీడా సామగ్రి అందజేత

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని కస్తూర్బా పాఠశాలకు వివేకానంద సేవా సమితి వారు రూ.13వేల విలువజేసే క్రీడా వస్తువులను అందజేశారు. క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం ఆట వస్తువులను సమితి అధ్యక్షుడు న్యాయవాది నాగభూషణంరెడ్డి సహకారంతో అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మలిశెట్టి జగన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు,కార్యదర్శి పువ్వాడ వెంకటరంగయ్య, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



ధర్మవరంలో కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న సమితి సభ్యులు

డోన్ టౌన్ : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకలు గురువారం గ్రామోత్సవంతో ముగిశాయి. పట్టణంలోని పాత బస్టాండ్‌లో ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన మండపంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి నాలుగు రోజులు పాటు ప్రత్యేక పూజలు,మంగళ హారతులు,తీర్థప్రసాద వితరణతో పాటు భగవద్గీత శ్లోకాలు వినిపించారు. చివరి రోజు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి మంగళ వాయిద్యాలు, చిన్నారులు కోలాటం ఆడుతూ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

డోన్ రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామంలో గురువారం త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. దీంతో వేడుకలు ముగిశాయి.

సంజామల: మండల పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. రామిరెడ్డిపల్లె త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు రాజశేఖర్ అధ్వర్యంలో శ్రీకృష్ణుడికి నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం గ్రామ సర్పంచ్ మంచాల ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ మంచాల సోమ సుందర్ రెడ్డి, గ్రామ ప్రజలు స్వామి వారికి కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. చివరి రోజు గ్రామంలో వీధి వీధినా స్వామి వారిని ఊరేంగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకట సుబ్బయ్య, గురు ప్రసాద్, సులోచన, గురు నాగేంద్ర, రమణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: కౌమర దశలో యువతీయువకులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో వివిధ పాఠశాలల్లో గురువారం విద్యార్థినీ విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీ మమత, ఏఎన్‌ఎం సుజాత పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా ప్రారంభం

బేతంచెర్ల: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని మండలంలోని బలపాల్లె గ్రామ సమీపంలో నున్న స్టోరేజ్ సంపు నుంచి గ్రామాలకు తాగునీటి సరఫరాను గురువారం ప్రారంభించారు. స్టోరేజ్ సంపు వద్ద కొలుములపల్లె సర్పంచ్ చిన్న మద్దమ్మ, ఉప సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ మరియమ్మ పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బుగ్గన చంద్రారెడ్డి , బాబుల్ రెడ్డి, ముర్తుజావలీ, ఖాజా, మురళీకృష్ణ, ఎద్దులన్న, తిమ్మయ్య పాల్గొన్నారు.

రెండోసారి క్రీడా ప్రతిభ అవార్డు

డోన్ రూరల్ : జిల్లా స్థాయి గేమ్స్ ఎక్సలెన్స్ అవార్డుల్లో వరుసగా రెండవ సారి ప్రథమ స్థానంలో డోన్ మండలంలోని యు.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికై ంది. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నంద్యాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్లను సన్మానించి, షీల్డ్, ప్రశంసా పత్రాన్ని అందించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బేతంచెర్ల: రైతులు పంటల్లో సరైన యాజమాన్యాలు పద్ధతులు పాటించాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రొద్దుతిరుగుడు శాస్త్రవేత్త వెంకటరమణమ్మ అన్నారు. గురువారం మండలంలోని హెచ్.కొట్టాల గ్రామంలో రైతు పరమేశ్వరుడు సాగుచేసిన ప్రొద్దుతిరుగుడు పంటను పరిశీలించారు. ప్రొద్దుతిరుగుడు పువ్వును శనగపచ్చ పురుగు, పొగాకు లద్దెపురుగు ఆశించి నష్టం చేస్తుందన్నారు. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏఓ కిరణ్ కుమార్, ఏఈఓ మధు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్యాపిలి: స్థానిక కేజీబీవీలో గురువారం ఫ్రెండ్లీ హెల్త్ డే కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు పలు జాగ్రత్తలు పాటించడం ద్వారా స్వీయరక్షణ పొందవచ్చన్నారు. అపరిచితుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. రక్త సంబంధీకులు కాకుండా ఇతర వ్యక్తులు అనవసరంగా తాకే ప్రయత్నం చేస్తే వెంటనే అక్కడి నుంచి తప్పుకోవాలని చెప్పారు.

కామాంధులను బహిరంగంగా ఉరి తీయాలి



ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో మతిస్థిమితం లేని మైనర్‌బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధులను బహిరంగంగా ఉరి తీయాలని సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్, దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నిందితులకు 2016 చట్టం ప్రకారం శిక్ష విధించడంతో పాటు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఓబులేసు, సుబ్బరాయుడు, శ్రీనివాసరెడ్డి, జాకీర్‌ఉసేన్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష మాధుర్యాన్ని కాపాడుకోవాలి



ఉపాధ్యాయిలను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు



కాలనాల పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం



కోవెలకుంట్ల ఉర్దూ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: చక్కని పలుకుబడులు, నుడికారాలు, అనేక చమత్కారాలతో కూడుకుని ఉన్న తెలుగు భాష మాధుర్యాన్ని కాపాడుకుందామని ఎంఈఓలు రాజయ్య,అబ్దుల్ కలాం పిలుపునిచ్చారు. గురువారం పెట్నికోట ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుధాకర్ గుప్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన తెలుగు పండిట్లను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ యూస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటేష్‌నాయక్, ఉపాధ్యాయులు వైవీఎస్ నారాయణరెడ్డి, మద్దిలేటి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవం

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు ఆయా గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా గురువారం సంజామల ప్రభుత్వ పాఠశాలలో ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ శ్రీనివాసులు, కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ అరుణ కుమారి ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కానాల పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, వెంకట నారాయణ, వ్యాయమ ఉపాధ్యాయుడు చిన్న మౌలాలిని ఉపాధ్యాయుల బృందం సన్మానించారు.

బనగానపల్లె రూరల్: మండలంలోని కైప జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, . జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుభాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, పీఈటీ వీరయ్య ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి

కోవెలకుంట్ల: పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. అలాగే తెలుగు బాషా కోవిదుడు గిడుగు రాంమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయిను అరుణ, భీమునిపాడు జెడ్పీ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయినీ జరీనాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజయ్య, మారూఫ్ అబ్బాస్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు బాషా, క్రీడా దినోత్సవం

డోన్ టౌన్ : గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్స్‌పాల్ భారతి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ లోకరాజు అధ్యక్షతన తెలుగు భాష ప్రాధాన్యతను వివరించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం పద్మావతి,సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యాక్రమాలకు ఎంఈఓ ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగుల నాగరాజు చేసిన అష్టావధానం అలరించింది. కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ప్యాపిలి: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాదినేనిదొడ్డి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో క్రీడాదినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

బేతంచెర్ల: తెలుగుకు ఎంతో ప్రాధాన్యత ఉందని మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గంగుల నాగరాజు అన్నారు. గురువారం ఏపీ మోడల్ స్కూల్‌లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వివిధ తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శించారు.

డోన్: తెలుగు భాష దినోత్సవం సందర్భంగా మండలంలోని గోసానిపల్లె గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామ్మూర్తి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కేజీబీవీలో క్రీడా పరికరాలను ప్రదర్శించిన దృశ్యం



బేతంచెర్ల మోడల్ స్కూల్‌లో తెలుగు కవుల చిత్ర పటాలతో విద్యార్థులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

బేతంచెర్ల: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న రేగటి చక్రపాణి రెడ్డి భార్య మేఘనను సంసారం విషయంలో తల్లి రేవతి మందలించింది. దీంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మేఘన (22) మనస్థాపానికి గురై కల్లాపు చల్లే రంగు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమెను నంద్యాల ఆసుపత్రికి తరలించిగా చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించింది. రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్ర శేఖరప్ప గురువారం తెలిపారు. అలాగే బుగ్గానిపల్లె తండాకు చెందిన కిశోర్ నాయక్ ద్విచక్రవాహనంపై బేతంచెర్లకు వచ్చి వీరబ్రహ్మేంద్ర స్వామి ధ్యాన పిరమిడ్ కేంద్రం వద్ద ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సజ్జద్ అలీ గురువారం తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

కృష్ణగిరి మండలానికి చెందిన బోయ చిన్నరాముడు కర్ణాటక మద్యాన్ని కారులో బేతంచెర్లకు వస్తుండగా ఎం.పేండేకల్లు గ్రామం వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు. 90 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, కారు సీజ్ చేసి కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అలాగే..వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన లక్ష్మన్న బేతంచెర్ల పట్టణంలోకి ద్విచక్రవాహనంపై నాటుసారా తీసుకొస్తుండగా అదుపులోకి తీసుకొని 20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా గురువారం తెలిపారు. బైక్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు.

మూడిళ్లలో చోరీ

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో మూడిళ్లలో వరుస చోరీలు జరిగాయి. బంధువుల వివాహం కోసం వెళ్లిన న్యాయవాది ఇంటితో పాటు మరో రెండిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం ఇంటి పక్కల వారు తలుపులు పగులగొట్టి విషయాన్ని గుర్తించి బాధితులకు సమాచారం ఇచ్చారు. న్యాయవాది ఇంట్లో కొంత బంగారం, నగదు, మరో ఇంట్లో కమ్మలు చోరీకి గురైనట్లు తెలిసింది. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించి చోరీకి గురైన ఇండ్లను పరిశీలించి క్లూస్ టీంని రప్పించి దర్యాప్తు చేపట్టారు. బాధితులు వచ్చే వరకు సరైన వివరాలు చెప్పలేమని పోలీసులు తెలిపారు.